
# డబ్బుచేదే!

- సత్యవాడ సోదరీమణులు



''శ్రీదేవి... వడ్డించేయ్. ఈరోజెందుకో ఆకలి దంచేస్తోంది.'' చదువుతున్న వీక్లీ టేబుల్ మీద పడేసి, బిగ్గరగా అన్నాడు శ్రీపతి.

''నా ఆలస్యం ఏమీ లేదండి. పిల్లల్ని కూడా పిలవండి.''

''ఆ... అన్నట్లు వాళ్లెక్కడ? అలికిడే లేదు...'' ఇల్లంతా కలియజూశాడు.

''నా మీద అలిగారు లెండి!''

''అదేం..?''

''ఎప్పుడూ అమ్మా కొడుకులు ఒకటై నా మీద యుద్ధం ప్రకటించడం పరిపాటి... కానీ, ఈవాళేదో కొత్తగా వుందే...'' భార్యని కొంటెగా చూస్తూ నవ్వాడు.

"కొత్తా లేదు. వింతా లేదు... మీరు పిలిస్తేనే వస్తారు వాళ్లు భోజనానికి. బెడ్‌రూంలో మంచం మీద ముసుగు తన్ని పడుకున్నారేమో... కాస్త చూసి పిలుద్దురూ... ఊర్కే తర్కించక."


అలానే చేశాడు శ్రీపతి.

గమ్మత్తేమిటంటే మంచమ్మీద వుంటారనుకున్న సంపత్, శరత్‌లు మంచం కింద దూరి తండ్రి కంట పడ్డారు. నవ్వుతూ భార్యని పిలిచాడు.

"చూశావోయ్ శ్రీదేవి...? అస్తమానం అతిథులొస్తుంటే ఇల్లు చాలడం లేదు అన్నావ్. వీళ్లు మంచి మార్గం కనిపెట్టారు. ఎంచక్కా రోజూ వీళ్లిక్కడే పడుకుంటారు. వచ్చే వాళ్లకిబ్బందు ండదు. మనకే బాధ వుండదు."

తండ్రి మాట పూర్తికానే లేదు. 'మేమేం ఇలా పడుకోం' క్షణంలో బయటకొచ్చి నిటారుగా నిల బడి ఒకేసారి అన్నారు.

వాళ్లకోపం తనమీదే అన్న సంగతే మర్చిపోయి




పగలబడి నవ్వేసింది శ్రీదేవి.

"నువ్వలాగే నవ్వుతావ్‌లే, మమ్మల్ని ఏడి పించి..." తొమ్మిదేళ్లు నిండని పెద్దకొడుకు సంపత్ అన్నాడు.

"మమ్మల్ని చూసి నవ్వావ్ కదూ! ఇంక నీ మాట అస్సలు వినం" ఏడేళ్లు నిండని శరత్ అన్నాడు.

సర్లేండి...ముందు డైనింగ్ టేబుల్ దగ్గరకు పదండి...అంటూ చిన్నవాడ్ని అమాంతం ఎత్తేసు కొని, పెద్దవాడ్ని చెయ్యందుకొని కదిలాడు శ్రీపతి. ఇద్దర్నీ డైనింగ్ టేబుల్ ముందు కుర్చీలో కూర్చో పెట్టి తనూ కూర్చున్నాడు.

భర్త చిటికెలో వీళ్లని దారికి తెచ్చారు. హమ్మయ్యా అనుకొంది. శ్రీదేవి కంచాలు పెట్టి వడ్డ నకు ఉపక్రమిస్తూ...

"నాన్నా... మీరు లాక్కొచ్చి కుర్చీలో కూర్చోపె డితే మేం అన్నం తినేస్తామని అనుకుంటోంది అమ్మ. మాకేం వడ్డించనక్కర్లేదు" సంపత్ దిగ్గున లేచాడు.

"అవును...మేం తినం గాక తినం" చిన్నవాడు శరత్ లేచి నిలబడ్డాడు.

"అబ్బబ్బా...వీళ్లనేమన్నావ్ శ్రీదేవి..." కథ మళ్లీ మొదటికే వచ్చినందుకు చికాకు పడిపో యాడు శ్రీపతి.

"నన్నడుగుతారేంటి? అమ్మ చెప్పింది వినాలి. పెట్టింది తినాలి అని వాళ్లకి బుద్ధి చెప్పండి."

'మాకెవ్వరూ చెప్పనక్కర్లేదు. మేం బుద్ధిమంతు లమే. అడిగినవి చేసి పెట్టకపోతే, ఎప్పుడూ నువ్వ చేసినవే తినాలంటే మాకు మాత్రం ఏం తినాలనుం టుందేం? నాలుగురోజులైంది. మా టిఫిన్ బాక్స్ ల్లోకి గారెలు చేసి పెట్టమని అమ్మని అడిగితే ఒక రోజు ఓపిక లేదు . ఇంకో రోజు నూనె అయిపో యిందని అంటుంది. కాకపోతే కోప్పడుతుంది.'

ఆ పసివాళ్ల మాటలకి ఒక్కక్షణం చలించాడు.

అతనికేదో గుర్తొచ్చింది. నిజమే.. శ్రీదేవి తరచూ ఇంట్లో సరుకులు నిండుకున్నాయని తనతో చెపు తోంది. తను మునుపట్లా తెచ్చి పెట్టలేకపోతు న్నాడు. మరి పిల్లలు అడిగినవి ఎలా చేసి పెట్టగ లదు? నిట్టూర్చాడు.

"సంపత్..శరత్ ఏంటర్రా మీ గొడవ. మీ నాన్న గారు ఆఫీసులో ఆరుగంటలు దాకా పనిచేసి, బుర్ర వేడెక్కిపోయి వస్తారు. ఎంచక్కా సరదాగా కబుర్లు చెప్పి మనం అలసటంతా మాయం చేసేయ్యాలి. మీరు పెద్దవాళ్లవుతున్నారు. ప్రతి దానికీ అలకలు, కోపాలు తెచ్చుకోవచ్చా" తల్లి అనేసరికి గప్‌చుప్‌గా కంచాల ముందు కూర్చున్నారు.

"అది... మా మంచి కన్నయ్యలు" అంటూ వాళ్ల కెంతో ఇష్టమైన తీపి ఆవకాయ, మజ్జిగ అన్నం ముద్దలు కలిపి ముద్దు ముద్దుగా తినిపించేసింది.

"ఏమిటి... అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" వంటింటి పని ముగించి, హాలులోకి వస్తూ భర్తతో అంది.

"ఏం లేదు శ్రీదేవి"

"అలా అనేస్తే నేనూరుకోనండి" ముఖానికి అడ్డంగా పెట్టుకున్న పేపరు తీసి పక్కన పడేస్తూ అంది. అతని ముఖంలో ఇన్నాళ్లూ తను చూడని వ్యాకులత స్పష్టంగా కనిపిస్తోందామెకు.

"ఇంత చిన్న విషయానికే ఇలా ఇదయిపోతా రెందుకు. ఇలా అయితే ముందు ముందు ఇంకా ఎన్నో ఎదుర్కోవలసి వుంటుంది మనం."

"అంటే?"...అయోమయంగా భార్య కళ్లలోకి చూశాడు. "మీరేం అనుకోనంటే ఒక్కమాట" భర్తకు దగ్గరగా జరిగి అతని చేతులు తన చేతుల్లోకి తీసుకొంది. ఇప్పటి వరకూ ఎంతో పొదుపుగా ప్రణాళికాబద్ధంగా రోజులు గడుపుతున్నాం. మనకు తెలియకుండానే ఒక్కసారిగా ఖర్చులు పెరి గాయ్. జీతం అందగానే మీరు తీసుకొచ్చే సరు కులు నెల మొత్తం సరిపోయేవి. మీ పర్సులోనూ, నా దగరా కూడా కాస్తో, కూస్తో మిగులుండగానే మళ్లీ జీతం చేతికొచ్చేసేది. ఇప్పుడు రెండు వారాలు తిరిగేసరికే పది రూపాయల కోసం వెతుకులాడు తున్నాం అంటే కారణం మీకు తెలియనిదే కాదు."

"ఏదో చెప్పాలనుకొని చెప్పలేక తటపటాయిస్తు న్నావ్ నా దగ్గర నీకు సంకోచం ఎందుకు సూటిగా విషయం చెప్పు శ్రీదేవి"

భర్త మాటలతో తిరిగి అందుకొంది. "అదేనండి శ్రీధరం గారి గురించి, కొంత కాలంగా ఆయన ప్రవర్తనలో ఎంత మార్పు వచ్చిందో గమనించా రా..."

శ్రీపతి ఉలిక్కిపడ్డాడు! "ప్రత్యేకంగా గమనించే దేముంది" అన్నాడు.

ఇదిగో ఇలా అంటారనే అతని వ్యవహారం శృతి మించుతున్నా నేనే నోరెత్తలేదు. ఎప్పట్లా వస్తూ పోతూ వుంటే, అతని స్నేహం మనకో సమస్యగా తయారయ్యేది కాదు. వెనకటికెవరో అన్నారుట. "గాదెలో ధాన్యం గాదెలో వుండాలి. పిల్లలు గాజు కాయల్లా వుండాలని" తన చేతికి మట్టి అంటకూ డదు. తన కోరికలన్నీ ఎదుటి వాళ్ల నెత్తిన రుద్దాలి. అలా వుంది ఆయన ధోరణి.

భర్తని నొప్పించకూడదనుకుంటూనే కలత పెట్టానే. అనుకున్న శ్రీదేవి ఉదాసీనంగా వుండిపో యింది.

శ్రీదేవి ఊరికే అనడం లేదు. నిజానికి శ్రీధరం ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగనిస్తూ తనే లొంగిపోతున్నాడు అనుకోగానే, తమ్ముడు శ్రీకాంత్ కళ్లలో మెదిలాడు. నిరుద్యోగిగా వాడు పడ్డ అవస్థలన్నీ తలపుల్లో చోటు చేసుకున్నాయ్.

పేపరు ప్రకటనలు చూడడం, అప్లికేషన్లు పెట్టడం ఎంత ఖర్చయినా భరించి ఇంటర్వ్యూలకు హాజరు కావడం, ఏ ఒక్కటి కలిసి రాక పోవడంతో రూపు కట్టిన నిరుత్సాహంలా దిగులు పడిపో వడం... వాడ్ని తను ఏ రకంగానూ ఓదార్చ లేకపో యేవాడు. వెన్ను తట్టి ధైర్యం చెప్పడం కూడా తనకి సాధ్యం అయ్యేది కాదు. అసలే మొహమాటస్తుడు.

"శ్రీలత, నువ్వు ఇక్కడే వుండండి. కలిగిందేదో కలబోసుకుని తిందాం. అన్నా ససేమిరా ఒప్పుకో

లేదు.

''అమ్మ మాట కాదనలేక పెళ్లంటే చేసుకున్నాను కానీ నా కాళ్ల మీద నేను నిలబడేంత వరకూ తన్ని కాపురానికి తీసుకొచ్చే ప్రశ్న లేదన్నయ్యా'' ఖచ్చితంగా అనేవాడు.

అలా వాడు నిరాసక్తంగా మాట్లాడుతుంటే కొంపతీసి వీడు ఆత్మహత్య చేసుకోడు కదా అని పించేది. అష్టకష్టాలు పడయినా వీడ్ని ఉద్యోగస్తుడ్ని చేసెయ్యాలి అనుకునేవాడేగాని తనే ఓ చిరుద్యోగి! ఏం సాధించగలడు. నడి సముద్రంలో కొట్టుకుపోతున్న వాడికి ఓ పడవ దొరికినట్లు శ్రీధర్ చేయూతనందించాడు. అతనికి తెలిసిన ఓ కంపెనీలో ఉద్యోగం ఇప్పించాడు. చాలా లాభాల మీద నడుస్తున్న కంపెనీ అది.

ఆరోజు తన తమ్ముడి ముఖంలో ఎంత వెలుగు చూశాడు. తనూ, శ్రీదేవి... తమ్ముడు, మరదలుతో వేరే ఊళ్లో కొత్త కాపురం పెట్టించాడు.

శ్రీధర్‌ని పెనవేసుకొని ''నీ రుణం తీర్చుకోలేనురా... మా వాడికి ఓ ఆధారం కల్పించావ్. మమ్మల్ని ఒడ్డున పడేశావ్'' ఆనందంగా అన్నాడు.

''రుణానిదేవుందిలే కాని నువ్వన్నట్లు అది సాదా సీదా కంపెనీ ఏం కాదు! నిజానికి లక్ష రూపాయలు ముడుపు కడితే కానీ ఎవరికీ దక్కేది కాదా ఉద్యోగం. నీ తమ్ముడ్ని అదృష్ట వంతుణ్ణి చేశాను. తిరుగులేని సీట్లో కూర్చో పెట్టేశాను. వాళ్ల బాదరా బందీ నీకేం వుండదు'' అంటూ చిద్విలాసంగా మీసాలు మెలేశాడు.

సాదరంగా డిన్నరుకు పిలిచింది శ్రీదేవి. శ్రీధర్ ఏ వంటకాలు ఇష్టపడతాడో బాగా తెలుసు శ్రీదేవికి. అతన్ని తరచూ ఆహ్వానిస్తూనే వుంటారా దంపతులు.

శ్రీధర్ వచ్చిన రోజు ఆ ఇంట్లో ఓ పండుగలాగానే వుంటుంది. కబుర్లతో గలగలలతో సంతోషం తాండవిస్తుంది. అంకుల్..అంకుల్... అంటూ పిల్లలు అతని చుట్టూ తిరుగుతారు. అతనూ అలానే వున్నంత సేపు వాళ్లని క్షణం కూడా వదలడు.

ఎన్ని గంటలయినా సందడిగా గడిచిపోతాయ్... ఆ రోజు మాత్రం శ్రీధర్ కొత్త ప్రపోజల్ పెట్టాడు. అప్పటివరకూ శ్రీధర్‌కి డ్రింకు అలవాటుందని తెలియని శ్రీపతి హతాశుడయ్యాడు.


''మన శ్రీకాంత్‌కి ఉద్యోగం వేయించాడు కదోయ్...కాదంటే ఏం బావుంటుంది'' శ్రీదేవికి నచ్చజెప్పి డ్రింక్ పార్టీ ఇచ్చాడు. అది మొదలు. తను పిలిచినా పిలవకపోయినా వచ్చేయడం, అలానే జరిపించుకోవడం పరిపాటయిపోయింది. ఇక ఈ తలనొప్పి వదిలేది కాదు తనకి. శ్రీకాంత్ కోసం ఈ ఖర్చు, ఈ మనస్తాపం తనకి తప్పవ్ ఒక్క శ్రీదేవి నేనా... ఈ మహానుభావుడి వైఖరి ఇబ్బంది పెట్టందెవ్వరినీ... ఎప్పుడూ పల్లెత్తుమాటనని పనిపిల్ల సీతాలు కూడా...


''మీరింత గమ్మనకుండా వుంటే ఆయనగారు రోజూ వచ్చినా వస్తారు. మీకు సూత్తే సిగరెట్టు ముట్టించే అలవాటే లేదు. అతగాడొచ్చి ఇల్లంతా సిగరెట్ పీకలు పోస్తాడు. ఇదింతా అదింతా తిన్నవన్నీ గలీజు చేసి, వదిలేసి పోతాడు. పైగా పదిమందికీ కనిపించేలా సీసాలొకటి. ఇల్లు సుబ్రం చెయ్యలేక, సర్దలేక శ్రీదేవమ్మకి, నాకూ ఇసుగేత్తుంది బాబూ... ఇంటికెవలెనా కొత్తోలొత్తే మీరే ఇట్టా సేత్తున్నారనుకోరూ...'' అంటూ క్లాసు తీసుకొంది. అద్దివ్వడానికి వెళితే ఇంటి ఓనరేమన్నాడు...

''చూడు...మిస్టర్... మీ ఇంట్లో కొత్త బాగోతాలేవో జరుగుతున్నాయట...తాగడాలు, తూగడాలు, బ్రేక్ డాన్స్‌లూ... రాత్రి పదకొండు వరకూ ఇల్లు హోరెత్తించేస్తున్నారట. నీ మంచికే చెప్తున్నాను. శ్రీపతి వెర్రిమొర్రి వేషాలు మానుకోండి. వీటి ప్రభావం పిల్లల మీద పడుతుంది. ఈయనగారు చెప్పేదేంటి? అనుకున్నావా? నా ఇల్లు ఖాళీ చేయవలసి వుంటుంది.'' అంటూ హెచ్చరించాడు.

ఇలా అందరి చేతా చెప్పించుకోవలసి వస్తోంది ఏమిటి ఖర్మ. ఈ వ్యవహారం శృతి మించి రాగాన పడితే అప్పులు కూడా చెయ్యక తప్పదేమో! మనసులో రేగిన తీవ్రమైన అలజడితో అర్ధరాత్రి పన్నెండు దాటినా అలానే కూర్చుండిపోయారిద్దరు. తీగలాగితే డొంకంతా కదిలినట్లు పిల్లల పేచీతో అనవసరంగా విషయం బయటకొచ్చింది.

''సారీ అండీ..! మిమ్మల్ని బాధ పెట్టాను...పన్నెండు దాటింది. తెల్లారితే ఉరుకులు పరుగులు మామూలే. పడుకుందాం పదండి'' సుతారంగా భర్త భుజం మ్మీద చేయ్యేసి బెడ్‌రూంలోకి నడిచింది.





★★★

''హాయ్ బాబాయ్.. శ్రీకాంత్‌ని చూస్తూనే అతనికి ఊపిరి సలపనివ్వకుండా చుట్టేశారు పిల్లలు. శరత్‌ని భుజమ్మీద కూర్చోబెట్టుకొని, సంపత్‌ని కౌగిలించుకొని లోపలికొస్తున్న మరిదిని చూస్తూ విస్తుపోయింది శ్రీదేవి.

''ఏం నాయనా! నువ్వెప్పుడొచ్చావ్...వీళ్లకెలా పట్టుబడిపోయావ్...?'' నవ్వుతూ అంది.

''పోన్లే వదినా వీళ్లిలా ప్రేమగా హత్తుకుంటే చెప్పలేనంత హాయిగా వుంటుంది నాకు...వీళ్లని భయపెట్టి, దెబ్బలాడి ఈ అభిమానానికి చనువుకి ఆనకట్ట వేయకు!''


''సరే నాయనా! నువ్వు నెత్తెక్కించుకొని ఊరేగుతానంటే నాదేం పోయింది. ఒళ్లు హూనం చేసుకో'' కాఫీ కలపడానికి వంటింట్లోకి వెళుతూ అంది. శ్రీదేవి కాఫీ గ్లాసుతో వచ్చేసరికి శ్రీకాంత్ తెచ్చిన ఖరీదైన కారు బొమ్మలతో విమానాలతో ఒకరితో ఒకరు పోటీ పడి ఆడేసుకుంటున్నారు. బిస్కట్ల ప్యాకెట్లు, ఫైవ్‌స్టార్ చాక్లెట్లు ముందు పోసుకున్నారు.

''శ్రీకాంత్ నీకేం మతిపోయిందా? ఇన్ని తీసుకొచ్చేశావ్'' బిస్కెట్లు,చాక్లెట్లు డబ్బాలోవేస్తూ అంది.

''ఎక్కువేం తేలేదొదినా ఇదివరకు నేను మీ దగ్గరే వున్నా, రోజూ వీళ్లతో గడుపుతున్నా, ఆడుకోవడానికి తినడానికి ఏమైనా ఇవ్వగలిగేవాడ్నా...అ



41




న్నయ్య దయతో నెల తిరిగేసరికి చేతినిండా జీతం అందుకొంటున్నాను.''

''మీకు నేనెంతో ఋణపడిపోయానొదినా...పని ఒత్తిడితో ఈ ఆర్నెల్లూ రావడానికి కుదరలేదు కానీ నా మనసునిండా మీ ఇద్దరే. మీరే నా పాలిట సీతా రాములొదినా...''

''అంతంత బిరుదులేం వద్దు కానీ, నువ్వు లక్ష్మణుడువంటావ్. మా ఊర్మిళ ఏమంటోంది...కొంప తీసి ఈ ఆర్నెల్లూ నిద్ర పోయిందా ఏమిటి?''

శ్రీకాంత్ ఫక్కున నవ్వాడు.

''మేలుకునే నిన్ను కలవరిస్తోంది. ఇప్పుడు నా వెంట పడింది....కానీ డాక్టర్ బెడ్‌రెస్టు అవసరం అన్నారు.

''అంటే మా చెల్లాయ్...''

''అవునొదినా... ఈ సిసింద్రీలిద్దరికీ ఓ చెల్లాయ్ సిద్ధమంటోంది''

''ఎంత శుభవార్త చెప్పవోయ్'' శ్రీకాంత్ చెయ్యందుకొని కరచాలనం చేసింది.

''ఒరేయ్ గడుగ్గాయిలూ ఏమిట్రా... నన్ను సస్పెన్స్‌లో పడేశారు. మన ముగ్గురమే ఏదో రహస్యం మాట్లాడుకోవాలంటారు. అదీ ఇంట్లో కాదంటారు. అమ్మా, నాన్న అస్సలు వినకూడదంటారు..తీరా పార్కుకి తీసుకొస్తే ఐస్‌క్రీం తింటూ ఆటల్లో పడ్డారు. ఎలా వేగేద్రా మీతో! రేపేగా నేనూరెళ్లిపోవాలి...విషయం తొందరగా చెప్పండి.''

శ్రీకాంత్ మాటతో పసివాళ్లిద్దరూ పెదవి కొరుక్కున్నారు.

''సారీ బాబాయ్ సో సారీ...'' అంటూ శరత్ ఒక్క గెంతులో వచ్చి శ్రీకాంత్ ఒళ్లో చేరాడు. సంపత్ పక్కకు చేరి బాబాయ్ చెవిలో గుసగుసలు మొదలుపెట్టాడు. శరత్ అన్నతో గొంతు కలిపాడు.

అన్న కొడుకులు చెబుతున్నది చెవి నుండి హృదయానికి పాకేసరికి శ్రీకాంత్ తల తిరిగిపోయింది. తనకి ఉద్యోగం ఇప్పించిన మిషతో అన్నయ్య వాళ్లని వేపుకుతింటున్నాడా...! తన మూలంగా ఇంత బెడద వచ్చి పడింది అన్నమాట వీళ్లకి. ఈ పరిస్థితి నుంచి తనే అన్నావదినల్ని వడ్డున పడేయ్యాలి. ఒక్క క్షణం ఆలోచించాడు... తను ఇలా చేస్తే మళ్లీ కథ మొదటికే వస్తుంది. ఏదైతే కానీ అన్న దృఢనిశ్చయంతో పిల్లల్ని తీసుకొని ఇంటి ముఖం పట్టాడు.

***

''ఏమంటున్నావు నువ్వు...! నాకైతే నమ్మాలని లేదోయ్. సలక్షణంగా నెలతిరిగే సరికి పదివేల సాలరీ ఇస్తున్నాం. నిక్షేపం లాంటి ఉద్యోగానికి నీళ్లొదిలేస్తానని ఎందుకంటున్నట్లు? నీకేం డబ్బు చేదా...?''

''అవున్సార్! నేను రిజైన్ చేస్తున్నాను. మీరు మరో ఇంటర్వ్యూ కండక్టు చేసుకోవచ్చు''సూటిగా మేనేజర్ ముఖం చూడలేని శ్రీకాంత్ గిర్రున వెనక్కి తిరిగాడు. అవును అది తెచ్చి పెట్టే ఇక్కట్లను బట్టి ఒక్కో సారి డబ్బు చేదే మరి. తన భవిష్యత్తు ఊహించుకుంటూ వుంటే అతని కళ్లు వర్షించడానికి సిద్ధంగా వున్న మేఘాలయ్యాయి. రేపులోని తీపిని చేజేతులా చేదుగా మార్చుకుంటున్నాడు. ఇంతకీ కారణం శ్రీధరం స్వార్థం, అవకాశవాదమేగా.

రిసీవర్ అందుకొని ఫోన్‌లో మాట్లాడుతున్న శ్రీధరం క్షణకాలం విస్తుపోయాడు.

''చాకులాంటి కుర్రాడోయ్ చాలా పనిమంతుడు. ఇలాంటి వాళ్లుంటే కంపెనీ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందనుకున్నాను. సడెన్‌గా ఆ అబ్బాయి అలా అంటాడేంటి? నువ్వు వెంటనే వాళ్ల అన్నయ్యని కలువు. శ్రీకాంత్ తన అభిప్రాయాన్ని మార్చుకునేలా చూడు''

ఫోన్ పెట్టేసినా కంపెనీ మేనేజర్ చెప్పిన విషయమే అతని మనస్సుని తొలిచేస్తోంది.

శ్రీకాంత్ ఉద్యోగానికి రాజీనామా చేస్తాననంటున్నాడా? తన మిత్రుడు శ్రీపతి అతని తమ్ముణ్ని ఉద్యోగస్తుని చేయ్యమని తనని ఎంత బ్రతిమాలాడాడు. ఎంత ప్రాధేయపడ్డాడు. తీరా ఈ అబ్బాయి చూస్తే ఆరునెలలు తిరిగే సరికి తనకక్కర్లేదు ఈ ఉద్యోగం అంటున్నాడు. కారణం అంతుపట్టడం లేదు శ్రీధరానికి. ఆ సాయంత్రమే శ్రీపతి ఇంటికి వెళ్లాడు....

''ఏమోయ్ మీ వాడు....!''

నాకూ అదే ఆశ్చర్యంగా వుందోయ్! ఇప్పుడే నాకు ఫోన్ చేసి చెప్పాడు. నేనేం చెప్పబోయినా వాడు వినిపించుకోలేదు. ఉద్యోగం విషయంలో తన అభిప్రాయాన్ని మార్చుకునేదిలేదని సూటిగా చెప్పాడు''

భర్త మాటలకు అడ్డొస్తూ... ''అదే అన్నయ్యగారు వారం క్రితం మా ఇంటికి వచ్చినప్పుడు తనకి మంచి ఉద్యోగం దొరికిందని ఎంత మురిసిపోయాడో...అలాంటిది ఇప్పుడిలా అంటున్నాడు. మా మరిది ధోరణికి నాకు పిచ్చెక్కుతోంది'' అంది శ్రీదేవి. ముగ్గురూ కాస్సేపు చర్చించుకున్నాక వెళ్లిపోయాడు శ్రీధరం.

వారం రోజుల తర్వాత శ్రీకాంత్ దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం అతని హృదయాన్ని శ్రీధరం ముందు పరిచింది... అంతా తన పొరపాటేనన్న మాట. ఏదో మేలు చేసానని, దానికి ప్రతిఫలం పొందాలని తన ఇష్టానుసారం ప్రవర్తించాడు. అది ఆ ఇంట్లో అంత కలకలం చేసిందా?చివరికి పసివాళ్ల మనసులు కూడా కలతపడేంత అవివేకంగా ప్రవర్తించాడు... ఛీ.. ఛీ... తన మీద తనకే అసహ్యం వేస్తోంది... ఇలా జరగడానికి వీల్లేదు.

తన ఉత్తరానికి చలించి ఇంత దూరం వచ్చాడు. అహాన్ని చంపుకొని తనని క్షమార్పణ అడుగుతున్నాడు. ఆస్తిలో హోదాలో తమ కుటుంబాలకన్నా ఎంతో హెచ్చు స్థాయిలో వున్నా ఇతను ఇలా అంటున్నాడంటే తన తప్పిదం అతనికి తెలిసినట్టేగా! పూర్తిగా పరివర్తన చెందాడనే లెక్క. మౌనంగా వున్న శ్రీకాంత్ ముఖంలో భావాలు వెతుకుతూ... ''నా మీద కోపం పోలేదా...''

''మీరు పెద్దవారు అలా అనకూడదు. ఏవేవో రాసి నా ఉత్తరంతో మిమ్మల్ని బాధ పెట్టానే అని ఆలోచిస్తున్నా''.

''చాల్లే ఊరుకో...లక్షణంగా నీ ఉద్యోగం నీవు చేసుకో... నువ్వు రిజైన్ చేస్తానన్నావని తను నా బుర్ర తినేస్తున్నాడు. నీలా శ్రద్ధగా పనిచేసే కుర్రాళ్లు అంటే ప్రాణమిచ్చే మనిషతను. నిన్నెలా అయినా ఒప్పించే బాధ్యత నాపై వేసుకుంటే కాని తృప్తి పడలేదు. నువ్వు రాజీనామా చెయ్యవని అతనికి మాటిచ్చేసాను. నా మాట నిలబెట్టవూ...అనాలోచితంగా నేను ప్రవర్తిస్తే...దాని ఫలితం నువ్వు అనుభవిస్తానడం సబబు కాదయ్యా..!

''సరే సార్ వదిలేయండి. నా జీవితాన్ని నిలబెట్టిందే మీరు కదా?'' ఎటొచ్చి మా అన్నా వదినలకి...

''అరే! మళ్లీ అదే అంటావ్. ఇక ఇబ్బంది కలిగించను. నీకు అన్నయ్య అయితే నాకు ప్రాణస్నేహితుడు కాదంటావా!'' శ్రీధరం పెదవులపై స్వచ్ఛమైన చిరునవ్వు శ్రీకాంత్ ముఖంలో వెలుగు నిచ్చింది.

★